# అధికారులు కలిసికట్టుగా పనిచేయాలి

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 16 : ఎన్నికల విధుల్లో నియమించిన అధికారులందరూ కలిసికట్టుగా ఆర్మీలా పని చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులందరూ తమకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తామనే పూర్తి విశ్వాసంతో పనిచేయాలని చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులకు సంబంధించి వచ్చిన ఫారం 7, 8లను ఈ నెల 19లోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో 51 వేల నూతన ఓటరు ఎపిక్ కార్డుల పోస్టల్ శాఖ ద్వారా జరుగుతున్న పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. చెక్ పోస్టులపై నిఘా ఉంచాలని, అనుమానాస్పదంగా డబ్బు, మద్యం, కానుకలు తదితర వాటిని రవాణా చేస్తే స్వాధీనం చేసుకోవాలని అన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఉల్లంఘనలు ఎక్కువగా జరిగే అవకాశముంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైట్ మ్యాప్ ఆధారంగా అన్ని పోలింగ్ బూత్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులున్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మను చౌదరి, ప్రభాకర్, శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, కలెక్టర్ ఏవో మసూర్ అహ్మద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ముగిసిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలు


విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 16 : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కొనసాగిన జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్-2023 సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గురుకులాల స్పోర్ట్స్ అధికారి రామలక్ష్మణ్ హాజరై మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతాయని అన్నారు. జోనల్‌స్థాయి స్పోర్ట్ మిట్‌లో 3వ జోన్ పరిధిలోని కామారెడ్డి, సిద్దిపేట్ జిల్లాల గురుకుల పాఠశాలల విద్యార్థినులు 1,275 మంది పాల్గొన్నారు. అండర్- 14, 17, 19 విభాగాల్లో గేమ్స్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. హ్యాండ్ బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్ పోటీల్లో విజేతలకు బహుమతులను జిల్లా ఇంటర్ మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, ఆర్సీవో అలివేలు, బాన్సువాడ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ ప్రదానం చేశారు. క్రీడాపోటీల ముగింపు సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బోర్లం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి, ప్రిన్సిపాళ్లు లక్ష్మీబాయి, శోభారాణి, పుష్పలత, నళిని, సవిత, స్వప్న, సత్యనారాయణ, పూర్ణచందర్‌రావు, స్రవంతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళా చాంపియన్‌గా నిజామాబాద్ జట్టు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 16 : తెలంగాణ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్‌లో నిజామాబాద్ జిల్లా జట్టు విజయం సాధించినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా మహిళల జట్టు సిద్దిపేట జట్టుపై 6-0 తేడాతో విజయం సాధించినట్లు తెలిపారు. జట్టుకు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ఉత్తమ పిక్చర్‌గా నిలిచిన ఎల్.రాణికి రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నవీన్ ప్రత్యేక బహుమతి అందజేశారు. విజేత జట్టుతోపాటు ఇందుకు కృషిచేసిన వారిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు అభినందించారు.


సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళా చాంపియన్స్ నిజామాబాద్ జట్టు

## తగ్గుతున్న నీటిమట్టం..

మెండోరా, అక్టోబర్ 16: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటి విడుదల కొనసాగుతుండంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నదని ఏఈఈ మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి 3150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిచేరుతున్నదని పేర్కొన్నారు. కాకతీయ కాలువకు 6000 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200, సరస్వతీ కాలువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నదని వివరించారు. మిషన్ భగీరథకు 152 క్యూసెక్కులు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రనికి1090.80 అడుగులు (89.212 టీఎంసీలు) నిల్వ ఉందని పేర్కొన్నారు.

## జోనల్‌స్థాయి పోటీల్లో ధర్మారం క్రీడాకారుల ప్రతిభ


బహుమతులతో ప్రతిభ చూపిన విద్యార్థులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 16 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో ధర్మారం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఆరు ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. బాసర జోన్ ( నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాకు)కు సంబంధించిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని లెఫ్ట్ పోచంపాడ్‌లో నిర్వహించారు. ఇందులో 14 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో గేమ్స్ ఓవరాల్ చాంపియన్ షిప్, అండర్-17లో గేమ్స్ ఓవరాల్, అథ్లెటిక్స్ ఇండివిజువల్, అథ్లెటిక్ ఓవరాల్, అండర్-19లో గేమ్స్ ఓవరాల్, అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ధర్మారం గురుకుల పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ అధ్యాపకురాలు జ్యోత్స్న, క్రీడాకారిణులను ధర్మారం పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయకర్త అలివేలు అభినందించారు.

## దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్ష

నందిపేట్, అక్టోబర్ 16: మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. మండలంలోని కంఠం గ్రామానికి చెందిన కుతాడి లింగం, కుతాడి దేవేందర్ పెద్దమ్మ ఆలయంలోని అమ్మవారి పుస్తెలను అపహరించారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం ఆర్మూర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి తీర్పును వెల్లడించారు. ఇద్దరు నిందితులకు ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వరి నిందితులకు జైలు శిక్ష పడేలా వాదనలు వినిపించారని ఎస్సై వివరించారు.

## మద్యం పోయనందుకు... ఒకరిని కొట్టి చంపిన తండ్రీకొడుకులు

- నవీపేట చేపల మార్కెట్‌లో ఘటన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ కిరణ్‌కుమార్


సాయిరాం (ఫైల్)

నవీపేట, అక్టోబర్ 16: మండలకేంద్రంలోని చేపల మార్కెట్‌లో మద్యం తాగుతున్న క్రమంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా.. మద్యం పోయనందుకు తండ్రీకొడుకులు కలిసి ఒకరిపై విచరక్షణా రహితంగా దాడి చేసి చంపారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, స్థానిక ఎస్సై యాదగిగౌడ్ సోమవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నవీపేటకు చెందిన కొక్కుల సాయిరాం(42) మండలకేంద్రంలోని చేపలమార్కెట్‌లో ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో లింగంగుట్టలో నివాసముంటున్న నాగరాజు, అతడి కుమారుడు గణేశ్ మార్కెట్‌కు వచ్చారు. తమకు కొంత మద్యం పోయాలని సాయిరాంను అడిగారు. సాయిరాం మద్యం పోయకపోవడంతో ఆయనతో తండ్రీకొడుకులు ఘర్షణ పడ్డారు. అప్పటికే తాగిన మైకంలో ఉన్న తండ్రీ కొడుకులు సాయిరాంపై దాడి చేసి ఇష్టం వచ్చినట్లు కడుపులో కొట్టడంతోపాటు తన్నారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. సాయిరాం తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో సాయిరాం భార్య, కుమారుడు ఆదివారం రాత్రి స్థానిక డాక్టర్ ద్వారా చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిందితులు నాగరాజు, గణేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీ

- ఆరోటౌన్ పరిధిలో రూ.6.87 లక్షల నగదు సీజ్
- దోమకొండలో రూ. 2 లక్షలు, మోర్తాడ్‌లో రూ.2.50 లక్షలు..


నగరంలో వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీసులు

నిజామాబాద్ క్రైం/దోమకొండ/ మోర్తాడ్, అక్టోబర్ 16 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీల ప్రక్రియను ముమ్మరం చేశారు. డబ్బులు, ఆయుధాలు, మద్యం తదితర వాటిని అక్రమ రవాణా చేయకుండా తనిఖీలు చేపడుతున్నారు. నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై కె.రవీందర్ సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి వద్ద రూ.5 లక్షల 22వేల 920, సారంగపూర్ ప్రాంతానికి చెందిన ఎం. రవీందర్ గౌడ్ అనే వ్యక్తి వద్ద రూ.లక్షా 65 వేల నగదు లభించదని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలశివారులోని సంగమేశ్వర్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 2లక్షలు పట్టుబడినట్లు ఎస్సై మురళి తెలిపారు. బీబీపేట మండలం మల్కాపూర్ గ్రామానికి వాహనంలో రూ. 2లక్షలు తరలిస్తుండగాపట్టుకున్నామని, డబ్బులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో డబ్బులను సీజ్ చేసినట్లు తెలిపారు. రుజువు పత్రాలు చూపిస్తే ఎన్నికల అనంతరం డబ్బులు అందజేస్తామన్నారు. తనిఖీల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ రాజేందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మోర్తాడ్ మండల కేంద్ర శివారులోని జాతీయ రహదారిపై ఎస్సై అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2.50 లక్షలను సీజ్ చేశారు.